క్లుప్తంగా

శ్రీప్రకాష్‌లో 17 నుంచి చెస్ పోటీలు

పెద్దాపురం: స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకూ సీబీఎస్ఈ సౌత్ జోన్–1 చెస్ పోటీలు నిర్వహించనున్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్ ప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అండర్–11, అండర్–14, అండర్–19 విభాగాల్లో మిక్స్‌డ్, బాలికల విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీలకు ఏపీతో పాటు తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్, నికోబార్ దీవుల నుంచి సుమారు 1,500 మంది క్రీడాకారులు పాల్గొంటారని విజయ్‌ప్రకాష్ వివరించారు. 19వ తేదీన జరిగే ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

వినియోగదారుల హక్కుల రక్షణ కమిటీ ఏర్పాటు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడ జెడ్పీ హైస్కూల్‌లో శనివారం వినియోగదారుల హక్కుల రక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. పాఠశాల హెచ్‌ఎం ఇ.రాజ్యలక్ష్మి, కో ఆర్డినేటర్ పీఎంఎస్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కుల రక్షణపై వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. వినియోగదారులు, రైతులు ఏ విధంగా మోసాలకు గురవుతున్నారో, వాటి నుంచి ఎలా రక్షణ పొందాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోరుమిల్లి వర్ధన్, కృష్ణ, సాహిత్య, గొల్లకోట లీల తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

సామర్లకోట: షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పని చేసే కార్మికులందరికీ కనీస వేతన చట్టం ద్వారా వేతనాలు పెంచాలని ఏఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బొత్స ఏసుబాబు డిమాండ్ అన్నారు. స్థానిక బెల్ల మార్కెట్ వద్ద శనివారం ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో ఆయన కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయిల్, ఎరువులు, పోర్టు, రొయ్యలు, టైల్స్, పెస్టిసైడ్స్, ఫుడ్ వంటి పరిశ్రమల్లో వేతన సవరణ చేయాలన్నారు. ఏఎఫ్‌టీయూ పెద్దాపురం డివిజన్ అధ్యక్షుడు ఉప్పాడ అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ముప్పిడి మణ్ణియ్య తదితరులు పాల్గొన్నారు.

దళిత సదస్సును విజయవంతం చేయాలి

పిఠాపురం: దళితుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యామ్నాయ విధానాలతో కాకినాడ సూర్యకళా మందిర్‌లో ఆదివారం నిర్వహించే రాష్ట్ర దళిత సదస్సును విజయవంతం చేయాలని కేవీపీఎస్ కార్మిక సంఘాల నాయకులు పిలుపు నిచ్చారు. పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీలో శనివారం కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కె.సింహాచలం ఆధ్వర్యంలో రాష్ట్ర దళిత సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. దళితులు సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

సామర్లకోట: కిరణ్ కంటి ఆస్పత్రి నిర్వహణలో స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. గత 15 ఏళ్లుగా మార్వాడీ భవరాల్ డి జైన్ ఆధ్వర్యాన గురుపూర్ణిమ సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. కోవిడ్ కారణంగా 2020 నుంచి మూడేళ్ల పాటు ఇవి జరగలేదు. 2006లో ప్రారంభమైన ఈ కంటి వైద్య శిబిరాల్లో ఇప్పటి వరకూ 4,687 మందికి పరీక్షలు, 1,650 మందికి ఆపరేషన్లు చేయించారు. కంటి సమస్యలు ఉన్న వారు ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

మాధవపట్నంలో డెంగీ కేసు

సామర్లకోట: మాధవపట్నంలో డెంగీ కేసు నమోదైంది. గ్రామానికి చెందిన పి.రాధ (52) డెంగీతో కాకినాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని జిల్లా మలేరియా అధికారి ఎస్.భాస్కరరావు శనివారం తెలిపారు. రాధ ఇటీవల హైదరాబాద్ వెళ్లారని, అక్కడ జ్వరం రావడంతో డెంగీగా నిర్ధారించారని వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్యులు పి.ప్రశాంత్ చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉండటంతో వైద్యం చేయించుకోవడానికి ఆమె స్వగ్రామం వచ్చారని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పిఠాపురం: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు గొల్లప్రోలు పోలీసులు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన పోలేటి నూకరాజు (30) ఈ నెల 11న పొలంలోకి వెళ్లి వచ్చి వాంతులు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఆరా తీయగా తాను అప్పుల బాధ భరించలేక గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసినట్లు చెప్పాడు. అతనిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

17న జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం

కాకినాడ సిటీ: జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పాల్గొంటారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాలని జెడ్పీ వర్గాలు కోరాయి.



సామర్లకోట పంచారామ క్షేత్రంలో కొలువుదీరిన బాలాత్రిపురసుందరి అమ్మవారు



గొల్లప్రోలులో ఎంగిలిపూల బతుకమ్మగా దర్శనమిచ్చిన అమ్మవారు



పాదగయ క్షేత్రంలోని పురుహూతికా అమ్మవారు



దసరా ఉత్సవాలకు ముస్తాబైన పాదగయ క్షేత్రం

కరుణించవమ్మా.. కాపాడవమ్మా..

- నేటి నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలు
- అమ్మవార్ల ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి
- పలు ప్రాంతాల్లో సిద్ధమైన మండపాలు

సామర్లకోట: శరన్నవరాత్ర ఉత్సవాలకు ఊరూవాడా ముస్తాబయ్యాయి. ఆదివారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకూ జరిగే ఈ ఉత్సవాలకు అమ్మవార్ల ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. సామర్లకోట స్టేషన్ సెంటర్‌లోని నూకాలమ్మ, బడేలమ్మ చెరువు వద్ద నవదుర్గ, అయోధ్యరామపురం కనకదుర్గ, సత్తెమ్మతల్లి, నీలమ్మ చెరువు వద్ద సత్తెమ్మ తల్లి, బ్రౌన్‌పేటలోని కనకదుర్గ, పెన్షన్ లైన్ సత్తెమ్మ తల్లి ఆలయాలతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో దేవీ నవరాత్ర ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పలు ప్రాంతాల్లో దసరా ఉత్సవాలకు మండపాలు కూడా ఏర్పాటు చేశారు. వీటిల్లో ఆదివారం అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. స్టేషన్ సెంటర్‌లోని నూకాలమ్మ ఆలయంలో అమ్మవారిని రంగులు వేసిన 40 కేజీల బియ్యంతో ప్రత్యేకంగా అలంకరిస్తామని ధర్మకర్త వల్లూరి బుల్లియ్య తెలిపారు.

పంచారామ క్షేత్రంలో..

స్థానిక పంచారామ క్షేత్రంలో వేంచేసి ఉన్న బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ప్రతి రోజూ ఉదయం దుర్గా సప్తశతి, బాలా పరమేశ్వరీ మంత్ర జపాలు నిర్వహిస్తారు. అమ్మవారికి ప్రతి రోజూ ఒక విశేష అలంకరణ చేసి, భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. ఆదివారం బాలాత్రిపుర సుందరీదేవి, 16న అన్నపూర్ణాదేవి, 17న గాయత్రీదేవి, 18న లలితా దేవి, 19న మహాలక్ష్మి, 20న సరస్వతీ దేవి, 21న మహిషాసురమర్దిని, 22న విజయదుర్గ, 23న శ్రీ రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారిని అలంకరిస్తారు. విజయదశమి పర్వదినాన మధ్యాహ్నం అమ్మవారిని వెండి చీరతో అలంకరిస్తారు. శమీపూజ, గ్రామోత్సవంతో ఈ దసరా వేడుకలు ముగుస్తాయి.



కొండెవరంలో దేవి ఆలయం వద్ద ఏర్పాట్లు

వేట్లపాలెం భేతాళస్వామి ఆలయంలో..

వేట్లపాలెం భేతాళస్వామి ఆలయంలో ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకూ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆదివారం ప్రారంభమయ్యే జాతర 25న అత్యంత వైభవంగా ముగుస్తుంది. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని ఉత్సవ కమిటీ నాయకులు కొండపల్లి సూరన్న చౌదరి, కొండపల్లి జగ్గారావు, గోలి వెంకట్రావు, నున్నా వెంకట్రాజు, గోలి శ్రీరామ్, గుణ్ణం సురేష్, కాకర్ల గంగాధర్, గుణ్ణం అంజనీ కుమార్, కొండపల్లి వేణు, గద్దె సాయిరాం తెలిపారు. పీబీ దేవంలోని శారదా రామకృష్ణ సేవా సమితిలో శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని అధ్యక్షుడు తోటకూర గంగాధర్ తెలిపారు.



పాదగయ క్షేత్రంలో భవానీ దీక్షలు స్వీకరిస్తున్న భక్తులు

బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం

పిఠాపురం: గొల్లప్రోలు రైల్వే స్టేషన్ వద్ద వెలసిన పాదాంబిక అమ్మవారి ఆలయం వద్ద శనివారం బతుకమ్మ (గౌరమ్మ) దసరా ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి వివిధ రకాల పూలతో బతుకమ్మను ప్రతిష్ఠించారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక అలంకరణల్లో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మొగలి అయ్యారావు ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గ్రామాల్లో సందడి

కొత్తపల్లి: గ్రామాల్లో దసరా సందడి నెలకొంది. శ్రీదేవీశరన్నవరాత్ర ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల వద్ద ఆలయ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని పలు అవతారాల్లో అలంకరించి ప్రత్యేక ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేస్తారు. కొత్తపల్లిలోని శ్రీధర్మశాస్తా ఆలయం వద్ద దసరా ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. వాకతిప్ప, ఉప్పాడ, కొండెవరం, కొమరగిరి, యండపల్లి తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

దసరా వచ్చిందయ్యా...

పిఠాపురం: గ్రామాల్లో దసరా సందడి నెలకొంది. దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పిఠాపురం నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రంలో దసరా ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ నెల 24 వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు

శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి ప్రతిరోజూ నిర్వహించే పూజల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే గ్రామాల్లో కనకదుర్గమ్మ ఆలయాలకు రంగులు వేసి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

ఎరుపెక్కిన గ్రామాలు

దసరా ఉత్సవాల్లో భాగంగా వేలాది మంది భవానీ దీక్షలు చేపట్టడంతో గ్రామాలు ఎరుపెక్కాయి. ఇప్పటికే అన్ని గ్రామాలలోనూ వందలాది మంది భవానీ దీక్షలు చేపట్టారు. గత వారం రోజుల నుంచి పాదగయ క్షేత్రంతో పాటు ఇతర దేవాలయాల్లో వందల మంది భవానీ మాలలు ధరిస్తున్నారు. ఒక్క పాదగయ క్షేత్రంలోనే శనివారం రెండు వేల మందికి పైగా భవానీ దీక్షలు స్వీకరించారు.

జవాబుదారీ పాలనే ధ్యేయం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- కొమరగిరిలో గడప గడపకూ మన ప్రభుత్వం

కొత్తపల్లి: ముఖ్యమంత్రి ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు జవాబుదారీ పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని కొమరగిరిలో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు స్వాగతం పలికి పూలమాల, శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే పార్టీ నాయకులు, అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత నాలుగున్నరేళ్లలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల రూపంలో చేకూరిన లబ్ధిని వివరించారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని ప్రజలు కోరారు. ఆయా సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నవరత్నాల పథకాలను సంక్షేమ క్యాలెండర్ ప్రకారం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజాధనాన్ని దోచుకున్న చంద్రబాబుకు మళ్లీ అధికారం కట్టబెట్టాలన్న ఆలోచనతో పచ్చ మీడియా చేస్తున్న కుటిల ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజా సేవ చేస్తున్న వలంటీర్లపై పచ్చనేతలు దుర్మార్గపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ జనసైనికులను టీడీపీకి తాకట్టు పెట్టారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్ కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడే సూర్యప్రకాష్‌రెడ్డి, గాంధీ, పీఏసీఎస్ అధ్యక్షుడు సత్యనారాయణ, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, సర్పంచులు నక్కా మణికంఠబాబు, రొంగళి వీరబాబు, పులి జయబాబు, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్ తదితరులు పాల్గొన్నారు.



కొమరగిరిలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

శృంగార వల్లభుని సన్నిధికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభుడు



స్వామి వారి సన్నిధిలో భక్తుల రద్దీ

పెద్దాపురం: తొలి తిరుపతిలోని స్వయంభూ శృంగార వల్లభస్వామి వారిని శనివారం సుమారు 5 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. టికెట్లు, అన్నదానం, కేశఖండన ద్వారా స్వామి వారికి రూ.4,27,699 ఆదాయం సమకూరిందని ఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు. దాతలకు అర్చకులు పెద్దింటి పురుషోత్తమచార్యులు, నారాయణాచార్యులు ఆధ్వర్యాన వేద పండితులు శేషవస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటాలు అందజేశారు. భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ ఆధ్వర్యాన భక్తులకు ఏర్పాట్లు చేశారు.

అడ్‌హాక్ కమిటీ ఎన్నిక

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అడ్‌హాక్ కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరరావు ప్రకటించారు. కాకినాడ రెవెన్యూ అసోసియేషన్ భవనంలో శనివారం జరిగిన సమావేశంలో అడహాక్ కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. చైర్మన్‌గా నవరపు చినపాపారావు, కన్వీనర్‌గా ఖండవల్లి చంద్రశేఖర్, కోశాధికారిగా కొప్పిశెట్టి కృష్ణ, సభ్యులుగా జోసఫ్ మార్సివన్, వాసంశెట్టి దుర్గాప్రసాద్, వృద్ధవోలు కృష్ణంరాజు, ఆర్.రవి, కురవాడ దుర్గాప్రసాద్, గోపి, షేక్ ముంతాజ్ బేగం, ఆర్.ఏసుబాబు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా టీవీ ఫణి పేర్రాజు, ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ పితాని త్రినాథ్, ఏపీ ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొని, అడ్‌హాక్ కమిటీ సభ్యులను అభినందించారు.

రైల్వే ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలి

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా మానవ హక్కుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ విలేకర్లతో మాట్లాడుతూ, కొన్నేళ్లుగా ప్లాట్‌ఫాంపై రెండో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తామనే ప్రకటన ఆచరణకు నోచడం లేదని అన్నారు. అలాగే విశాఖ, విజయవాడ వైపు వెళ్లే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడం దారుణమన్నారు. వందేభారత్, స్పెషల్ రైళ్ల పేరుతో ప్రయాణికులను దోచుకొంటున్నారని ఆరోపించారు. సీనియర్ సిటిజన్ల రాయితీలను తిరిగి ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఆర్‌ఎంకు లిఖితపూర్వకంగా రిజిస్టర్ పోస్టులో వినతి పంపించామని చెప్పారు.



రైల్వే స్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మానవ హక్కుల సంఘం నాయకులు

అథ్లెటిక్స్ సంఘ అధ్యక్షునిగా రంగారావు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా అథ్లెటిక్స్ సంఘ అధ్యక్షునిగా టీవీఎస్ రంగారావు ఎన్నికయ్యారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంఘం సర్వసభ్య సమావేశం కార్యదర్శి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన శనివారం జరిగింది. ఇటీవల మరణించిన అధ్యక్షుడు డాక్టర్ కె.స్వర్ణన్‌రాజు స్థానంలో నూతన అధ్యక్షుడిని సభ్యులు ఎన్నుకున్నారు. సంఘ సీనియర్ సభ్యుడు, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘ ఈసీ సభ్యుడు అయిన రంగారావును అధ్యక్షునిగా సుబ్రహ్మణ్యం ప్రతిపాదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అథ్లెటిక్స్ సంఘ ప్రతినిధులు కొండలరావు, పీడీలు గిరి, ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ వర్మ పాల్గొన్నారు.

చిట్టీల సొమ్ము ఎగ్గొట్టిన మహిళపై కేసు

తుని: చిట్టీల పేరుతో వ్యాపారులు, ప్రజల నుంచి సొమ్ములు వసూలు చేసి ఎగ్గొట్టిన మహిళపై కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ బి.చిన్నారావు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తుని మండలం రేఖవానిపాలేనికి చెందిన సుంకర లక్ష్మి చిట్టీలు నడుపుతోంది. అదే మండలానికి చెందిన చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు గంట్ల సత్యనారాయణ రూ.లక్ష విలువ చేసే రెండు చిట్టీలను సుంకర లక్ష్మి దగ్గర వేశారు. గడువు ముగిసినా చిట్టీల సొమ్ము ఇవ్వలేదు. ఇటీవల సత్యనారాయణ గుండెపోటుతో మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు పలు సార్లు చిట్టీల సొమ్ము ఇవ్వాలని ఆమెను అడిగారు. తమ గుమస్తాను రేఖవానిపాలెంలోని లక్ష్మి ఇంటికి పంపారు. ఆమె అక్కడ లేక పోవడంతో గుమస్తా తిరిగి వచ్చి విషయాన్ని తెలిపారు. సమచారం తెలుసుకున్న సుంకర లక్ష్మి తుని పట్టణంలో ఉన్న సత్యనారాయణ షాపుకు వెళ్లి గొడవ చేయడంతో సత్యనారాయణ కుటుంబ సభ్యుడు చిట్టిబాబు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు చిన్నారావు తెలిపారు.

సీఎం హామీతో కదిలిన అధికారులు



ఏలేరు కాలువ బ్రిడ్జి నిర్మాణంపై రైతులకు వివరిస్తున్న ఏఈ వీరబాబు

- కాండ్రకోట ఏలేరు బ్రిడ్జి నిర్మాణంపై పరిశీలన
- త్వరలో పనులు చేపడతామని వెల్లడి

పెద్దాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీతో అధికార యంత్రాంగం కాండ్రకోటకు కదలి వచ్చింది. కాండ్రకోట వద్ద ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఏలేరు కాలువ బ్రిడ్జి నిర్మాణానికి సుమారు రూ.6 కోట్లు ఇస్తామని సీఎం హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏలేరు ఇరిగేషన్ అధికారులు కాండ్రకోటలోని సంబంధిత కాలువ నిర్మాణ పనులపై శనివారం పరిశీలించారు. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణంపై ఈ నెల 12న జరిగిన సామర్లకోట బహిరంగ సభలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నిధులు మంజూరు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ అధికారుల ఆదేశాల మేరకు జేఈ వీరబాబు, సంబంధిత టెండర్ కాంట్రాక్టర్ రవీంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబుతో కలిసి పరిశీలించారు. దీనిపై పూర్తి నివేదిక అనంతరం త్వరలోనే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడతామని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు భద్రరావు, గంటా రామస్వామి, గవరసాని రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

ఆహా ఏమి రుచి !

- అదరగొడుతున్న క్యాంటీన్
- సరసమైన ధరలకే రుచికరమైన ఆహారం
- ఏరియా ఆసుపత్రి వద్ద పేదలకు అందుతున్న సేవలు

పెద్దాపురం: పేదల ఆకలి తీర్చేందుకు స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ‘ఆహా’ క్యాంటీన్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. రుచికరమైన ఆహారం తక్కువ ధరలకే లభ్యం కావడంతో ఈ క్యాంటీన్ అందరి మన్ననలూ పొందుతోంది. స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆదాయాన్ని పెంచడంతో పాటు నిర్ణీత ధరలకే అందరికీ శుచిగా వండిన రుచికరమైన ఆహారం అందించే లక్ష్యంతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పర్యవేక్షణలో ఈ క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. పెద్దాపురం ఏరియా ఆసుపత్రి వద్ద గత ఆగస్టు 26న ఈ ఆహా క్యాంటీన్ ప్రారంభించారు. ఏడాది కాలపరిమితితో దీనిని నిర్వహిస్తున్నారు. ఈ క్యాంటీన్‌లో ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకూ 13 రకాల వంటకాలు అందుబాటులో ఉంటున్నాయి. ఇక్కడ ఆహార పదార్థాల ధర గరిష్టంగా రూ.45కు మించి లేకపోవడం విశేషం. బయటి మార్కెట్‌లో భోజనం, అల్పాహారంతో పోలిస్తే నామమాత్రపు లాభార్జనతో ప్రజలకు మేలు చేసేలా ఆహా క్యాంటీన్ ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆహారాన్ని పూర్తిగా ప్యాకేజ్ (పార్శిల్) పద్ధతిలోనే అందిస్తారు. ఈ క్యాంటీన్‌లో రోజుకు 80 నుంచి 100 మందికి పైగా ఆహార ప్యాకెట్లు కొనుగోలు చేస్తున్నారు. తద్వారా దీని నిర్వాహకురాలు చెల్లుబోయిన రత్నం డ్వాక్రా సంఘం ద్వారా రోజుకు సుమారు రూ.1,200 వరకూ వ్యాపారం చేస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సందర్శకులతో పాటు వివిధ పనులపై పట్టణానికి వస్తున్న వారు సైతం ఆహా క్యాంటీన్ సేవలను వినియోగించుకుంటున్నారు.



పెద్దాపురం ఏరియా ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్

క్యాంటీన్‌లో లభించే ఆహార పదార్థాల ధరలు

ఆహార పదార్థం	ధర (రూ.లలో)
ఇడ్లీ–3	20.00
దోశ–1	20.00
మైసూర్ బజ్జీ–4	20.00
పూరీ–1	25.00
మినపట్టు–1	20.00
టీ–1	5.00 - 10.00
కప్పు పాలు	10.00
మీల్స్–1	45.00
లెమన్ రైస్	35.00
పుదీనా రైస్	35.00
జీరా రైస్	35.00
వెజిటబుల్ బిర్యానీ	40.00
పెరుగు అన్నం	25.00

ఆదరణ పెరుగుతోంది

పెద్దాపురం ఏరియా ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. తక్కువ ధరతో ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడం వలన అందరూ ఈ క్యాంటీన్ సేవలను వినియోగించుకుంటున్నారు. ఆసుపత్రికి వస్తున్న వారే కాకుండా బయటి వ్యక్తులు కూడా ఇక్కడ ఆహారం తింటున్నారు.

– యు.జ్యోతిరాణి, మున్సిపల్ మేనేజర్, పెద్దాపురం

